క్లుప్తంగా

డ్రిప్‌పై రైతులకు అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న పీడీ సుదర్శన్

పెనుకొండ: రైతు పొలాల్లో డ్రిప్ అమర్చే సమయంలో వారికి తగిన సూచనలు ఇవ్వాలని ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ పేర్కొన్నారు. పట్టణంలోని హార్టికల్చర్ కార్యాలయంలో మంగళవారం డీసీఓ, ఫిట్టర్‌లతో సమావేశమై పలు సూచనలు, సలహాలిచ్చారు. ఆయన మాట్లాడుతూ డ్రిప్పుకు సంబంధించి కలెక్టర్ అప్రూవల్ రాగానే రైతులకు కంపెనీ ప్రతినిధుల ద్వారా ట్రెంచ్ మార్కింగ్, ట్రెంచ్ కటింగ్ అనంతరం రైతుల ఇంటి వద్దనే డ్రిప్ డెలివరీ ఇవ్వాలన్నారు. కంపెనీ ఫిట్టర్స్ ఏ మాత్రం ఆలస్యం చేయకుండా రైతుకు ఏ పొలంలో అయితే మంజూరు అయిందో ఆ పొలంలో ఇచ్చిన డిజైన్ ప్రకారం హెడ్ కంట్రోల్ యూనిట్, మెయిన్ లైన్, సబ్‌లైన్, బాల్వాల్స్, ఫస్ట్ వాల్స్ లేటరల్స్ వాటికి ఎండ్ క్యాప్స్ ఏర్పాటు చేసే విధానంపై రైతుకు అవగాహన కల్పించాలన్నారు.

సజావుగా మండల సర్వసభ్య సమావేశం

గోరంట్ల: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ ప్రమీల అధ్యక్షతన సజావుగా జరిగింది. అన్ని శాఖల అధికారులు ఆయా శాఖల పరిధిలోని పురోగతి సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రమీల మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ రాజకీయలకు అతీతంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్ర, తహసీల్దార్ మారుతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అమరాపురం: పోలీసుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి విద్యార్థులకు ఏఎస్ఐ. రామాంజినేయులు ఆధ్వర్యంలో వ్యాస రచన, వక్తృత్వపు పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోలీసుల విధులు, బాధ్యతలు, తదితర అంశాలపై మాట్లాడటంతో పాటు పరీక్షలో పాల్గొన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు ఇవ్వనున్నట్లు ఏఎస్ఐ రామంజనేయులు తెలిపారు.

పోలీసు విధులపై అవగాహన



సెట్ నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గోరంట్ల: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో సీఐ శేఖర్ ఆధ్వర్యంలో ఎస్‌ఏపీఎస్ జూనియర్ కళాశాల విద్యార్థులకు పోలీసుల విధులపై అవగాహన కల్పించారు. పోలీసులు ప్రజలకు అందిస్తున్న సేవలు, చట్టాలు, ఆయుధాల వినియోగం, రికార్డుల నిర్వహణ, తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి వృథాకు చెక్



తాగునీటి ట్యాంక్ వద్ద నీరు వృథా కాకుండా చర్యలు తీసుకున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

రొద్దం: మండల పరిధిలోని పెద్దకోడిపల్లిలో ప్రభుత్వ తాగునీటి ట్యాంక్ వద్ద వృథా అవుతున్న తాగునీటిపై సోమవారం 'వృథా వుతున్న తాగునీరు' అన్న శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి, ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ గోవిందప్ప, సర్పంచ్ రూప తాగునీటి వృథాను అరికట్టడానికి చర్యలు తీసుకున్నారు. నీటి వృథాను అరికట్టడంతో పాటు ట్యాంకు పరిసరాలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు.

ఘనంగా జెండా పండుగ

పెనుకొండ: పట్టణంలోని శ్రీరాములయ్య కాలనీలోని జెండా కట్ట వద్ద మంగళవారం ఇన్సాఫ్ కమిటీ ఆధ్వర్యంలో జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. సీపీఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సంప్రదాయ పద్ధతిలో జెండాలు పట్టుకుని పాటలు, నృత్యాలు చేశారు. రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని అల్లాను ప్రార్థించారు.

వదలని వర్షం .. పంటకు నష్టం



చిలమత్తూరు మండలం మరవకొత్తపల్లి వద్ద కుషావతి పరవళ్లు



పెనుకొండ మండలం సత్తారుపల్లిలో దెబ్బతిన్న ఉల్లి పంటను చూపుతున్న రైతులు



అగళి మరువ ప్రవహిస్తున్న రావుడి చెరువు



పెనుకొండ మండలం అమ్మవారుపల్లిలో టమాట పంట దెబ్బతిన్న దృశ్యం



లేపాక్షి మండలం బసవనపల్లిలో నేలకొరిగిన వరి పంట

మడకశిర: నియోజకవర్గంలో భారీ వర్షాలు కురిశాయి. సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం ఉదయం వరకూ ఎడతెరపి లేకుండా వర్షాలు పడ్డాయి. ఒకే రోజు 5 మండలాల పరిధిలో మొత్తం 196.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మడకశిర మండలంలో 58.6, అమరాపురం మండలంలో 44.2, గుడిబండ మండలంలో 24, రొళ్ల మండలంలో 21.4, అగళి మండలంలో 48.6 మి.మీ చొప్పున వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. పలుచోట్ల వాగులు, వంకలు పెద్ద ఎత్తున ప్రవహించాయి. కుంటలు, చెక్‌డ్యాంలకు జల కళ వచ్చింది. పలు మండలాల్లో భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. జేసీబీ సహాయంతో గుడిబండ చెరువు లీకేజీని అధికారులు పూడ్చి వేయించారు.

చిలమత్తూరు/లేపాక్షి: చిలమత్తూరు, లేపాక్షి మండలాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. చిలమత్తూరు మండలంలో 32.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ యూనిస్ బాబు తెలిపారు. వాగులు, వంకలు పొంగి పొర్లాయి.కుషావతి, చిత్రావతి నదులకు వరద నీరు పోటెత్తింది. కోడూరు థామస్ మన్రో తోపులోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు అధికారులు సెలవు ప్రకటించారు. లేపాక్షి మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలువురు రైతులకు చెందిన పంట పొలాలు జలమయం అయ్యాయి. ముఖ్యంగా వేరుశనగ, వరి, రాగి, మొక్కజొన్న, జొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయి.

పరిగి: మండలంలో జయమంగళి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పాయకట్ట నుంచి దాదాపు రెండున్నర నెలల నీరు పరిగి చెరువుకు చేరిందని అధికారులు అంచనా వేస్తున్నారు. తాజాగా జయమంగళి నది ఉధృతి ప్రవాహంతో పాయకట్ట నుంచి జయమంగళి దిగువ ప్రాంతాలకు వరద నీటి ప్రవాహం ప్రారంభమయ్యింది. దీంతో దిగువ ప్రాంతాల్లోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

పెనుకొండ రూరల్: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు సత్తారుపల్లిలో రైతు రఘునాథ్‌రెడ్డి మూడెకరాల్లో సాగు చేసిన ఉల్లి పంట మొత్తం మావటూరు చెరువులోకి కొట్టుకుపోయింది. దాదాపుగా రూ.12 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. మరోవైపు మండల వ్యాప్తంగా 63 హెక్టార్లలో వివిధ పంటలు ధ్వంసమైనట్లు ఏఓ చందన తెలిపారు.

రొద్దం: మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు, కుంటలు, చెక్‌డ్యాంలు పొంగి పొర్లాయి. మంగళవారం తురకలాపట్నం, పానిపపల్లి, పెద్దిపల్లి చెరువులు మరువపోతున్నట్లు ఆయా గ్రామాల రైతులు తెలిపారు. వర్షపు నీటితో నారనాగేపల్లి బ్రిడ్జి వద్ద పెన్నా పరువళ్లు తొక్కుతోంది. రొద్దం పెద్దచెరువుకు దాదాపు ఐదు నెలలకు సరిపడ నీరు చేరినట్లు రైతులు తెలిపారు.

గోరంట్ల: మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి భారీ వర్షం పడింది. దీనికి తోడు ఎగువ ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు పడటంతో చిత్రావతి నది పరవాళ్లు తొక్కింది. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి.

పెనుకొండ: పెనుకొండ పరిధిలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు వంకలు పారుతున్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయంగా మారాయి. బోయగేరికి వెళ్లే రహదారిలో డ్రైనేజ్ సరిగా లేక ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భోగసముద్రం చెరువుకు వర్షపు నీరు భారీగా చేరింది. ఫీపారం సమీపంలోని వంక ప్రవహించడంతో సమీపంలోని పొలాలు జలమయంగా మారాయి.



పరిగి: కూలిన ఇంటిని చూపుతున్న బాధితుడు

వర్షానికి కూలిన మిద్దెలు

పెనుకొండ రూరల్: మండలంలోని శెట్టిపల్లి సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పురాతన మిద్దెలు కూలాయి. గ్రామానికి చెందిన శివారెడ్డి, నంజిరెడ్డి, రత్నమ్మలకు చెందిన మిద్దెలు కూలిపోయాయి. అయితే వారు అదనపు గదుల్లో నిద్రిస్తుండటంతో ప్రమాదం తప్పింది.

పరిగి: మండలంలో కురుస్తున్న వర్షాలకు సోమవారం రాత్రి మండలంలో ఐదు ఇళ్లు దెబ్బతిన్నాయి. ఎస్.ముద్దిరెడ్డిపల్లిలో మూడిల్లు , కాలువపల్లి, ఎర్రగుంటలో ఒక్కో ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు తహసీల్దార్ హసీనాసుల్తానా తెలిపారు. మంగళవారం ఆమె ఆయా గ్రామాల్లో పర్యటించి నష్టపరిహారం కోసం నివేదికలు సిద్ధం చేశారు.

తెగిన హంద్రీనీవా కాలువ



సోమందేపల్లి: మండలంలోని పందిపర్తి గ్రామ సమీపంలో హంద్రీనీవా కాలువ తెగిపోయింది. దీంతో మంచేపల్లి చెరువుతో పాటు వ్యవసాయ పొలాల్లోకి నీరు వృథాగా పోయాయి. మరోవైపు మంచేపల్లి, పత్తికుంటపల్లి, వెలిదడకల, మేకలపల్లి, నాగినాయని చెరువుతో పాటు సోమందేపల్లి చెరువులు మరువ పారాయి.

సోమందేపల్లి: పందిపర్తి వద్ద తెగిన హంద్రీనీవా కాలువ



మడకశిర మండలం కల్లుమర్రిలో నేలకు ఒరిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ తిమ్మప్ప



రొద్దం నారనాగేపల్లి బ్రిడ్జి వద్ద పరవళ్లు తొక్కుతున్న పెన్నానది



చిలమత్తూరు మండలం కొత్తచామలపల్లి సమీపంలో వర్షానికి దెబ్బతిన్న పూల తోట



గోరంట్ల సమీపంలో పరవళ్లు తొక్కుతున్న చిత్రావతి నది

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హిందూపురం: ఏపీఎస్ ఆర్టీసీ హిందూపురం డిపోలో చాలాకాలంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు సత్వరం పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు డిపో మేనేజర్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా డిపోలో ఏకపక్షంగా రద్దుచేసిన బెంగళూరు, పావగడ, నంద్యాల, చెక్‌పోస్ట్, కడప, బళ్లారి సర్వీసులను తిరిగి పునరుద్ధరించాలన్నారు. డిపోలోని అన్ని బస్సుల కండీషన్‌ను మెరుగు పరిచి గ్యారేజీ కార్మికులకు అవసరమైన టూల్స్, మెటీరియల్స్ సకాలంలో సరఫరా చేయాలన్నారు. ఖాళీగా పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో డిపో చైర్మన్ కిరణ్ కుమార్, రాజారెడ్డి, టీఎస్ నాథ్, తిప్పారెడ్డి, షబ్బీర్, విజయలక్ష్మి ఎస్‌పిఎం భాష, మారుతి, క్రిష్టప్ప, రాజా తదితరులు పాల్గొన్నారు.

కాలువకు మరమ్మతు చేయండి

సోమందేపల్లి: మండలంలోని పందిపర్తి వద్ద హంద్రీనీవా కాలువకు గండి పడిన ఘటనపై మంత్రి సవిత స్పందించారు. అమరావతి నుంచి ఫోన్ ద్వారా ఆమె హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించినట్లు మంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి.

'సస్యరక్షణ'తో అధిక దిగుబడి



ఎల్లోటిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని రైతులు పంట సాగులో సస్యరక్షణ పద్ధతులతో పంటలను సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చని ఏఓ తిమ్మప్ప తెలిపారు. మంగళవారం ఎల్లోటి గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. పొలాల్లో పర్యటించి రాగి, కంది, మొక్కజొన్న, వేరుశనగ పంటను పరిశీలించారు. అనంతరం రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కంది పంట ఆశాజనకంగా ఉందని తెగుళ్ల సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, సర్పంచ్ గంగమ్మ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలోని వలస, విరుపసముద్రం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి మంజునాథ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పంటలు ఏ విధంగా సాగు చేయాలి? తదితర విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అగళి: మండలలోని నరసబూంది,ఆలూడి గ్రామంలో ఏఓ శేఖర్ నాయక్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఏఓ శేఖర్ నాయక్ మాట్లాడుతూ.. వర్షాల కారణంగా రైతులు చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. కోతకి వచ్చిన పంటను కోయకూడదని, ముందుగా కోసిన పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలి అని సూచించారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత



అమరాపురం: మాట్లాడుతున్న ఎంఈఓ రాఘవయ్య

అమరాపురం: సమాజంలో బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంఈఓ రాఘవయ్య పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని హేమావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఆర్డీటీ సంస్థ ఆ పాఠశాల హెచ్ఎం.విజయమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ, ఆర్డీటీ ఆర్డీ మల్లికార్జున మాట్లాడుతూ బాలికలు చదువుతోనే స్వయం సమృద్ధి సాధించవచ్చన్నారు.

రొళ్ల: బాలురకు ధీటుగా బాలికలు విద్యలో రాణించి అత్యున్నత స్థాయికి చేరుకోవాలని ఎంఈఓ శ్రీధర్, ఆర్డీటీ ఐఎఫ్ఐ డైరెక్టర్ రామేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎం.రాయాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఆర్డీటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో బాలికలు, తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడ పిల్లల తల్లిదండ్రులు బిడ్డల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఉన్నత చదువులు చదివించడానికి శ్రద్ధ వహించాలన్నారు.

హేమావతి పంచాయతీకి రూ.5.6 లక్షల ఆదాయం

అమరాపురం: మండలంలోని హేమావతిలో ఉన్న చెరువుల్లో చేపల పెంపకానికి మంగళవారం ఈఓఆర్డీ నాగముని, సర్పంచ్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన రామచంద్రప్ప హేంజేరు చెరువులో చేపల పిల్లలను వదలడానికి రూ.2,50,000, పురవరం చెరువును నింగరాజు రూ.2,37,000, పర్లకట్టలో తిప్పజ్జ రూ.78,000కు దక్కించుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి నరేష్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అంచనా రుసుం వసూలు చేయండి



మాట్లాడుతున్న కమిషనర్ సంగం శ్రీనివాసులు

హిందూపురం: పట్టణంలో నిర్మాణాలకు సంబంధించి షార్ట్ ఫాల్ అమౌంట్ (అంచన రుసుం) వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్లతో ఆయన సమావేశం నిర్వహించారు. పూర్తిస్థాయిల్లో నిర్మాణాలకు సంబంధించి ప్రాథమికంగా ఉన్న లేవుట్స్ ప్లానింగ్ నమూనాలు మున్సిపాల్టీకి అందజేయాలన్నారు. భవన నిర్మాణదారులతో షార్ట్ ఫాల్ అమౌంట్‌ను నవంబర్ 15వ తేదీ లోపు మున్సిపాల్టీకి చెల్లించేలా చూడాలన్నారు. అలాగే సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులతో కలసి వార్డుల వారీగా నిర్మాణాల ప్లాన్స్ సిద్ధం చేయాలన్నారు.

వీధి దీపాల ఏర్పాటు

మడకశిర: పట్టణంలోని పలు కాలనీల్లో అంధకారాన్ని నివారించడానికి వీలుగా మంగళవారం మున్సిపల్ అధికారులు విద్యుత్ స్తంభాలకు ఎల్ఈడీ లైట్లను అమర్చారు. మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, ఏఈమురళి ఆధ్వర్యంలో వాటిని అమర్చారు. 16వ వార్డు పరిధిలోని సీసీ బండ, నాగన్నకుంట ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు ఎల్ఈడీ లైట్లు అమర్చినట్లు వారు పేర్కొన్నారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో కూడా వీధి దీపాలు సక్రమంగా వెలిగే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



పుల్లీకుంటలో భూమి పూజ చేస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలోని పుల్లీకుంట గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి మద్దనకుంట పంచాయతీ సర్పంచు గోవిందరాయ, ఎంపీడీఓ రామరావు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్డు లేని వీధుల్లో నిర్మాణం చేయడానికి పూజ చేశామన్నారు. వారితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం వడ్డించాలి

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెను ప్రకారం రుచికరమైన భోజనాన్ని వడ్డించాలని ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని మల్లినమడుగు, హునిసేకుంట ప్రాథమిక పాఠశాలతో పాటు ఎం.రాయాపురం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు తనిఖీ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు.

డైరెక్టర్‌గా రంగధామప్ప ఏకగ్రీవం



పావగడ: తాలూకాలోని గొడేటి గ్రామానికి చెందిన దొమ్మతమరి గ్రామ పంచాయతీ పీడీఓ ఎం రంగధామప్ప పావగడ తాలూకా గ్రామీణాభివృద్ధి , పంచాయతీరాజ్‌శాఖ డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో డైరెక్టర్ స్థానానికి ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. స్థానిక గ్రామ పంచాయతీ పీడీఓలు, దొమ్మతమరి గ్రామ పంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులు ఆయన ఎన్నికపై హర్షం తెలిపారు.

అరసికెరెలో కాంగ్రెస్ విజయం



నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని అరసికెరె గ్రామ పంచాయతీ అధ్యక్ష స్థానానికి నిర్వహించిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయవం సాధించింది. గోపాలకృష్ణ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఎన్నికల్లో ఆయనొక్కడే నామినేషన్ పత్రం దాఖలు చేయడంతో ఎలాంటి పోటీ లేకుండా గోపాలకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తహసీల్దార్ వరదరాజు ప్రకటించారు. నూతన అధ్యక్షుడిని స్థానిక కాంగ్రెస్ నాయకులు, పంచాయతీ సభ్యులు అభినందించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

రొద్దం: బాల్య వివాహాలు జరిపిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుజాత తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బాల్య వివాహాలు జరిపించడం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. సోమవారం పెద్దకోడిపల్లిలో ఓ బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నట్లు తెలిసింది. 13 ఏళ్ల బాలిక తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు సమాచారం.

అభివృద్ధి పనులకు భూమి పూజ

రొళ్ల: మండల పరిధిలోని బీజీ హళ్లి, మల్లినమడుగు, హెచ్‌టీ హళ్లి గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పర్యటించారు. ఆయా గ్రామాల్లో పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా రూ.80 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేశారు. అలాగే సాయంత్రం స్థానిక సీహెచ్‌సీ ఆస్పత్రిని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సందర్శించి ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, వక్కలిగ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ పాండురంగప్ప, సర్పంచ్ సదాశివప్ప, కన్వీనర్ దాసిరెడ్డి, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురుమూర్తి, ఏపీడీ లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్, ఏపీఓ ఓబుళప్ప తదితరులు పాల్గొన్నారు.